తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర ప్రారంభం





బంగారుచీర అలంకరణలో ముత్యాలమ్మ - ఆలయం వద్ద భక్తుల రద్దీ

చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో మంగళవారం ముత్యాలమ్మ జాతర ప్రారంభమైంది.తూర్పుకనుపూరు, ఈదలవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం, కొమరావారిపాళెం గ్రామాల్లో ఘటాన్ని ఊరేగించారు. గంగమిట్ట మీద తాత్కాలికంగా పోలేరమ్మకు వేదిక ఏర్పాటు చేశారు. గుడిసెలో కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తప్పెట్లు, తాళాలతో మోసుకువచ్చి ప్రతిష్ఠించారు. గాలిగంటల చెట్టు వద్ద కుంభం పోశారు. భక్తులు వేయికండ్ల కుండలలో గండదీపాలను వెలిగించుకుని నెత్తిన పెట్టుకుని, మొలకు వేపాకులు ధరించి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముత్యాలమ్మకు బంగారుచీర అలంకారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సామూహిక పల్లకీ సేవ, పూలంగిసేవ ఘనంగా జరిపారు. రాత్రికి అర్ధరథంపై అమ్మవారిని సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

- చిల్లకూరు

మీ గుడ్లు, చికెన్ తిరిగిచ్చేస్తాం

- ఎమ్మెల్యే కించపరచడం తగదంటూ శ్రీకాళహస్తిలో మైనారిటీల నిరసన ప్రదర్శన -

కరోనా కాలంలో తమకు గుడ్లు, చికెన్ పంపిణీ చేశానంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి పదేపదే ప్రస్తావిస్తూ తమను కించపరచడం బాగాలేదంటూ పలువురు ముస్లిం మైనారిటీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చికెన్, కోడిగుడ్లు, కూరగాయలతో మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.కరోనా సమయంలో ప్రచార ఆర్భాటం కోసం దాతలిచ్చిన కోడిగుడ్లు, చికెన్, కూరగాయలను ఎమ్మెల్యే పంపిణీ చేశారని చెప్పారు. అవి ఒకసారి తీసుకున్న పాపానికి నాలుగేళ్ల నుంచి రోజూ విలేకరుల సమావేశాలు పెట్టి మైనారిటీలను అవహేళన చేస్తున్నారని వాపోయారు. తాము చికెను, కోడిగుడ్లు, కూరగాయలను తిరిగి ఇచ్చేస్తామని వాటిని సంచుల్లో చేతబట్టి ప్రదర్శించారు. పట్టణంలోని కుమారస్వామి తిప్ప కూడలి నుంచి టీడీపీ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది.మైనారిటీల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే ఎలాంటి కృషీ చేయలేదని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో మైనారిటీలంతా వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్, కాసరం రమేష్, మస్తాన్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి



కలెక్టర్ లక్ష్మీశపై ఈసీ బదిలీ వేటు

● మరికొందరిపైనా చర్యలకు అవకాశం

జిల్లా కలెక్టర్ లక్ష్మీశపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఎమ్మెల్యేని ఇంటికెళ్ళి కలిసి....

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత జనవరి ఆఖర్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించే జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులంతా బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తుండిన లక్ష్మీశ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో వచ్చినందున జిల్లా ఎన్నికల అధికారిగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని ప్రజలకు, రాజకీయ పార్టీల నేతలకు నమ్మకం కలిగించే విధంగా ఆయన నడుచుకోవాల్సి వుండింది. కానీ గత జనవరి 31వ తేదీన బాధ్యతలు చేపట్టగా అదే రోజు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఇంటికి వెళ్ళి కలిశారు. ఆ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అది తిరుపతిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. టీడీపీతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులంతా మీడియా సమావేశాలు పెట్టి మరీ ఆయన తీరుపై విమర్శలు, ఆరోపణలు చేశారు. జిల్లాలో నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహిస్తారని కలెక్టర్‌పై తమకు నమ్మకం లేదంటూ ప్రకటించారు.ఎన్నికల కమిషన్‌కు సైతం ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయన జిల్లాలో తొలి అడుగే వివాదాస్పదమైంది.

చంద్రగిరి టీడీపీ నేతల ఫిర్యాదులపై ఈసీని తప్పుదోవ పట్టించే ప్రయత్నం

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అనేక అంశాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.ఈఆర్వో కార్యాలయంలో పలువురు అధికారులు, సిబ్బంది అధికార పార్టీ ఎమ్మెల్యేకి అనుకూలంగా పనిచేస్తున్నారనే అంశంపై ప్రధానంగా ఫిర్యాదులు చేశారు. వీటిపై కలెక్టర్‌ను ఈసీ వివరణ కోరగా ఫిర్యాదుల్లో స్పష్టత లేదని ఆయన ఈసీకి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.అయితే తాము చేసిన ఫిర్యాదులకు సంబంధించి టీడీపీ నేతలు ఆధారాలను కూడా ఈసీకి సమర్పించి వుండడంతో కలెక్టర్ పనితీరుపై ఈసీ అసంతృప్తికి లోనైనట్టు తెలిసింది.

వైసీపీ ప్రచార సామగ్రి ఉదంతంలో నిర్లక్ష్యం

రేణిగుంట శివార్లలో గత నెల 26వ తేదీన నాలుగు గోదాముల్లో రూ.కోట్ల విలువైన వైసీపీ ప్రచార సామగ్రి పట్టుబడిన సంగతి తెలిసిందే. దీనిపై తొలుత రేణిగుంట టీడీపీ నేతలు గోదాముల వద్ద ఆందోళనకు దిగారు. తర్వాత చంద్రగిరి టీడీపీ నేతలు గోదాముల వద్దే రాత్రంతా కాపలా కాశారు. ఆపై శ్రీకాళహస్తి టీడీపీ నేతలు రంగంలోకి దిగారు.వారూ గోదాముల వద్ద ఆందోళన చేపట్టారు. తిరుపతి టీడీపీ నేతలు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేశారు. గోదాముల్లో నేరుగా పార్టీకి సంబంధించిన ప్రచార సామగ్రిపై ఎవరికీ పెద్దగా అభ్యంతరాల్లేవు. కానీ కొన్ని గోదాముల్లో ఒకరిద్దరు వైసీపీ నాయకుల వ్యక్తిగత ప్రచారానికి సంబంధించిన సామగ్రి, అలాగే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రి పట్టుబడ్డాయి. వాటిపై పేర్లు, ఫొటోలు కూడా స్పష్టంగా కన్పిస్తున్నా అధికారులు అత్యంత ఉదాసీనంగా వ్యవహరించారు. రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి దాకా, అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీలు కూడా బాధ్యతగా స్పందించలేదు. నాలుగు రోజుల పాటు వివాదం కొనసాగినా కలెక్టర్ గానీ, ఎస్పీ గానీ గోదాములను పరిశీలించకపోవడం విమర్శలకు దారి తీసింది. ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి దొరికినపుడు లోతుగా విచారణ జరపడం అటుంచి ఆధారాలు దొరికిన మేరకైనా బాధ్యులకు నోటీసులు జారీ చేయడం, వారిపై చర్యలకు ఉపక్రమించకపోవడం అందరిలో అనుమానాలు రేకెత్తించింది. చివరికి మీడియా ద్వారా కూడా జిల్లా అధికారులు ప్రజలకు స్పష్టమైన సమాచారం, సమాధానం ఇవ్వలేదు. ఇతర జిల్లాల్లో ఇలాంటి వస్తువులు పట్టుబడినప్పుడు వాటిని కోర్టులకు స్వాధీన పరిచి, కోర్టుల అనుమతితో వాటిని రిలీజ్ చేయడం జరుగుతోంది. అయితే రేణిగుంట ఉదంతంలో జిల్లా అధికారులు ఆ పద్ధతి పాటించకుండా బిల్లులు చూపించారని చెప్పి నేరుగా సామగ్రిని విడుదల చేయడం విమర్శలకు దారి తీసింది. ఈ వ్యవహారంపై స్థానిక టీడీపీ నేతలతో పాటు విజయవాడలో వివిధ రాజకీయ పార్టీల ముఖ్యనేతలు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలసి ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ కలెక్టర్ లక్ష్మీశ తీరు సక్రమంగా, పారదర్శకంగా లేదని భావించి బదిలీ వేటు వేసింది.

జిల్లా పరువు తీస్తున్న అధికారులు

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిజాయితీగా పనిచేయాల్సిన అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులు తాము తప్పటడుగులు వేయడంతో పాటు ఏకంగా జిల్లా పరువు కూడా తీస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా 2020-21లో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అరాచక పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. అధికార పార్టీ నేతలు, శ్రేణులు పలుచోట్ల రెచ్చిపోయి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్, తిరుపతి అర్బన్ ఎస్పీ, పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలు తమ పరిధిలో జరిగిన ఈ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమయ్యారు. దీంతో 2021 జనవరి 27న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అప్పటి కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిలతో పాటు పలమనేరు డీఎస్పీ, పుంగనూరు, శ్రీకాళహస్తి సీఐలపై బదిలీ వేటు వేశారు. ఈ పరిణామంతో జిల్లా ప్రతిష్ఠ దెబ్బతింది. అదే ఏడాది జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో నకిలీ ఓటరు కార్డులతో దేశవ్యాప్తంగా జిల్లా పరువు పోయిన సంగతీ తెలియంది కాదు. ఆ ఎన్నికల్లో దారుణమైన తప్పిదాలకు బాధ్యులుగా మారడంతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి తదుపరి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా వుండిన గిరీశపై ఈ ఏడాది జనవరి 19న ఈసీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆ క్రమంలో తిరుపతి డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి సహా ఇద్దరు సీఐలు, కిందిస్థాయి సిబ్బంది కూడా సస్పెండయ్యారు. ఈ రెండు ఘటనలతో జిల్లా ప్రతిష్ఠ దెబ్బతిందని ప్రజానీకం బాధపడుతున్న తరుణంలో తాజాగా కలెక్టర్ లక్ష్మీశ సస్పెన్షన్ జిల్లా పరువు మరోసారి గంగలో కలిసినట్టయింది. ఐఏఎస్ కెరీర్‌లో తొలిసారి జిల్లా కలెక్టర్‌గా నియమితులైన లక్ష్మీశ 60 రోజుల స్వల్ప వ్యవధిలోనే ఈసీ కన్నెర్రకు గురై బదిలీ కావడం, ఎన్నికల ప్రక్రియ ముగిసే దాకా ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించే పరిస్థితి రావడం జిల్లా అధికార, ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడేళ్ళ వ్యవధిలో మూడు పర్యాయాలు జిల్లా వేదికగా జరిగిన ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి కీలక అధికారులు ఎన్నికల కమిషన్ చర్యలకు గురి కావడం మాత్రం నిస్సందేహంగా జిల్లా ప్రతిష్ఠను మసకబారేలా చేసింది.

జిల్లాలో మరికొందరిపైనా చర్యలు?

ప్రస్తుతానికి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో వున్న కలెక్టర్ లక్ష్మీశ బదిలీ వేటుకు గురి కాగా తదుపరి జిల్లాలో మరికొందరు అధికారులపైనా చర్యలు తీసుకునే అవకాశముందని సమాచారం. ముఖ్యంగా చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు చెందిన కీలక అధికారుల తీరు పట్ల ప్రతిపక్ష పార్టీల నాయకులు అపనమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారి తీరుపై ఆధారాలతో ఇప్పటికే ఈసీకి ఫిర్యాదు చేశారు. అలాగే మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో పలువురు అధికారులు, ఉద్యోగులు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా పనిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చాలావరకూ ఆధారాలు జతచేసి మరీ టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేస్తున్నారు. ఆ క్రమంలో రానున్న కొద్ది రోజుల్లో మరికొందరిని కూడా ఎన్నికల విధుల నుంచీ తప్పించే అవకాశముంది.

ఇంచార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర



తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బదిలీ అయ్యారు. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆయనను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్రకు ఛార్జి అప్పగించి కలెక్టర్ లక్ష్మీశ రిలీవ్ అయ్యారు. ప్రధాన కార్యదర్శి జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల్లో ఆయనకు తదుపరి పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలనా శాఖలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. కాగా ఆయన స్థానంలో ఇంచార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ కలెక్టర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. ప్రధాన కార్యదర్శి ముగ్గురు ఐఏఎస్ అధికారుల పేర్లతో కూడిన ప్యానెల్‌ను ఈసీకి నివేదించాల్సి వుంది. అందులో ఈసీ సూచించిన అధికారిని తిరుపతి కలెక్టర్‌గా నియమించనున్నారు. దీనికి సంబంధించి ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి.

అధికారులకు బదిలీలు సాధారణం:లక్ష్మీశ

ప్రభుత్వ అధికారులకు బదిలీలు సర్వ సాధారణమని బదిలీ అయిన కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. జిల్లాలో పనిచేసింది కొద్ది రోజులే అయినా శ్రీవారి పాదాల వద్ద పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీకి గురి కావడంపై మాట్లాడుతూ ఏమి జరిగిందో తనకు తెలియదన్నారు. తాను ఎన్నికల ప్రక్రియలో చిత్తశుద్ధితో పని చేశానని, జిల్లా అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేశానన్నారు.

చిత్తూరు ఎస్పీ జాషువాపైనా



చిత్తూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ జాషువాపై మంగళవారం ఈసీ బదిలీ వేటు వేసింది. విధుల్లో చేరిన రెండు నెలలకే అవమానకరమైన రీతిలో బదిలీకి గురి కావడంతో పాటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎన్నికలకు సంబంధించిన విధులు, బాధ్యతలు అప్పగించవద్దని ఈసీ ఆదేశించడం గమనార్హం. 'మనం ఎన్నికల సంఘం పరిధిలో పనిచేస్తున్నాం. ఏ పార్టీకీ అనుకూలంగా ఉండొద్దు. నిక్కచ్చిగా వ్యవహరించండి' అంటూ నిత్యం పోలీసు అధికారుల సమావేశాల్లో, టెలీకాన్ఫరెన్సుల్లో చెప్పే ఎస్పీ జాషువా.. లోపల మాత్రం వైసీపీకి అనుకూలంగా చేయాల్సిందంతా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తారనే ఆయన్ను బదిలీపై జిల్లాకు పంపినట్లు తెలుస్తోంది. గతంలో విజయవాడ శాంతిభద్రతల డీసీపీ, కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేసినప్పుడు కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. వైసీపీకి విధేయుడనే ముద్ర వేసుకోవడంతోనే జిల్లాకు వచ్చారనే ప్రచారం జరిగింది. దీనికి బలం చేకూరేలా ఆయన జిల్లాకు వచ్చిన వెంటనే తన టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొన్ని రోజుల ముందే జిల్లాలో అటాచ్‌మెంట్‌లో ఉన్న సుమారు 200 మంది సిబ్బందిని పూర్వ స్థానాలకు బదిలీ చేశారు. దీంతో పాటు కీలకమైన స్పెషల్ బ్రాంచి విభాగంలోనూ 14 మందితో టీమ్‌ను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఇలా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించే ఎస్ఐ, సీఐలను క్షేత్రస్థాయిలో సిద్ధంచేసినట్లు ప్రచారంలో ఉంది. ఆయన వచ్చాక 400 మందికిపైగా టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేసినట్లు సమాచారం. ఇలా జిల్లాలో వైసీపీ విజయానికి అవసరమైన ప్లాన్ అమలులో భాగస్వామ్యం అయ్యారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు కలెక్టర్లు, ఎస్పీలపై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. అందులో ఎస్పీ జాషువా కూడా ఉన్నారు. దీనిపై విచారించి తగిన ఆధారాలను సేకరించిన కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు చిత్తూరు ఎస్పీని కూడా బదిలీ చేసి, ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించింది. ఫిబ్రవరి 4న బాధ్యతలు స్వీకరించిన జాషువా.. ఏప్రిల్ 2న బదిలీ వేటుకు గురయ్యారు. అడ్మిన్ ఏఎస్పీ అరీఫుల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా వ్యవహరించనున్నారు. నేడో రేపో కొత్త ఎస్పీని నియమించే అవకాశముంది.

తిరుపతిలో తొలి తల్లిపాల నిధి



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 2: రాష్ట్రంలోనే తొలి తల్లిపాల నిధి తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి- శిశువైద్యశాలలో ఏర్పాటవుతోంది. తిరుపతి రోటరీక్లబ్ రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ తల్లిపాల సేకరణ కేంద్రాన్ని నేటి ఉదయం పది గంటలకు ప్రారంభిస్తారు.

ఎందుకు: పుట్టిన బిడ్డలకు తల్లి పాలే తొలి వ్యాక్సిన్. కానుపులో చనిపోయిన తల్లుల బిడ్డలకు, నెలలు నిండకుండానే పుట్టిన పిల్లలకు తల్లిపాలు అవసరం. వీరికి తల్లిపాల నిధి నుంచి పాలను పంపిణీ చేస్తారు.

సేకరణ ఎలా: అధికంగా పాలుపడిన తల్లుల నుంచి పాలు సేకరిస్తారు. బ్రెస్ట్ పంప్ ద్వారా ఒక్కొక్కరి నుంచి 30-40మిల్లీ లీటర్ల పాలు సేకరిస్తారు. పాశ్చరైజేషన్ చేసి డీప్ ఫ్రిజ్‌లో నిల్వవుంచుతారు. తీవ్రమైన జబ్బులు లేకుండా, ఆరోగ్యంగా ఉండే తల్లులు తమ బిడ్డలకు పట్టగా మిగిలే తల్లిపాలను మాత్రమే సేకరించి ఈ కేంద్రంలో నిల్వ చేస్తారు. ప్రసవించిన నాలుగు రోజుల తరువాత నుంచి గరిష్టంగా ఎన్ని రోజుల వరకైనా తల్లులు తమ పాలను వితరణ చేయవచ్చు.

ఎంత కాలం ఉంటాయి: మూడు నెలల పాటూ ఈ పాలను పిల్లలకు తాగించవచ్చు.

ఇలా పాలను ఇవ్వడం వల్ల నష్టం లేదా: తల్లికి మంచిది కూడా. ఇందువల్ల మహిళలకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు బాగా తగ్గుతాయి. ప్రోలాక్టిన్ అనే హార్మోను ఉత్పత్తి అవుతుంది. ఇది కుటుంబ నియంత్రణకు సహకరిస్తుంది. ఎక్కువ కాలం పాలను ఇవ్వడం ద్వారా నెలసరి రాకుండా వాయిదాపడి రక్తస్రావ నష్టం నివారింపబడుతుంది.

ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని 6 శాసన సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించింది.గూడూరుకు చిల్లకూరి వేమయ్య , సూళ్లూరుపేటకు గాది తిలక్‌బాబు, చంద్రగిరికి కనుపర్తి శ్రీనివాసులు, శ్రీకాళహస్తికి డాక్టర్ పోతుగుంట రాజేష్ నాయుడు , సత్యవేడుకు బాలగురవమ్ బాబు, నగరికి రాకేష్‌రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించారు.తిరుపతి, వెంకటగిరి స్థానాలకు మాత్రం అభ్యర్థులను ప్రకటించలేదు.

శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయ శుద్ధి



తిరుమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని(ఆలయ శుద్ధి) టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించింది. 9వ తేది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు స్వామివారి మూల విరాట్టును వస్త్రంతో కప్పివేశారు. శుద్ధి పూర్తయిన తర్వాత నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు.టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, డీఎల్వో వీర్రాజు, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అహోబిలం పీఠాధిపతి



తిరుచానూరు, ఏప్రిల్ 2: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని మంగళవారం అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తన శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

తిరుచానూరు, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం తనిఖీ చేశారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లు ఇబ్బంది పడకుండా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో నిశాంతరెడ్డి, తదితర అధికారులు ఉన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 93మంది ఎంపిక

రామచంద్రాపురం, ఏప్రిల్ 2: మండలంలోని వెంకటరామాపురం సమీపంలో గల సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 93మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు తెలిపారు. అపోలా ఫార్మసీ సంస్థ నియామక ప్రక్రియ జరిపిందన్నారు. కరస్పాండెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు కవాతు



రామచంద్రాపురం, ఏప్రిల్ 2: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. మంగళవారం ఎన్నికల అధికారి గుర్తించిన సమస్యాత్మక గ్రామాలు కుప్పంబాదూరు, రాయలచెరువుపేట, పరమాల, కొత్తకండ్రిగ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భంగా వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సురేష్, ధన, త్యాగ, రమణ, రమేష్‌రెడ్డి, యోబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయాలి

● ఎంపీడీవోకు టీడీపీ వినతి

తిరుపతి(రూరల్),ఏప్రిల్2: ఎన్నికలకోడ్ నేపథ్యంలో పింఛన్లను సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేసే ఏర్పాట్లు చేయాలని తిరుపతి రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో రమేష్‌బాబును పార్టీనాయకులతో కలసి వినతిపత్రం సమర్పించారు.

టీడీపీలో చేరిక



గంగాధరానికి టీడీపీ కండువా కప్పుతున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 2: రావిళ్లవారిపల్లె పంచాయతీ బ్రాహ్మణకాల్వ పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు గంగాధరం మంగళవారం టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరినాయుడు గంగాధరంకు పార్టీ కండువా కప్పి నిర్వహించారు.

ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి

భాకరాపేట, ఏప్రిల్ 2: సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని మండల టీడీపీ శ్రేణులు ఎంపీడీవోకు మంగళవారం వినతిప్రతం అందజేశారు. సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బెల్లంకొండ మురళి, కార్యదర్శి మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, మునస్వామి నాయుడు, కుమారస్వామిరెడ్డి, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, విజయశేఖర్‌గౌడ్, చంద్రశేఖర్, మల్లిఖార్జున రెడ్డి, మౌలాలి, సహదేవరెడ్డి, ఎర్రయ్యనాయుడు, వెంకటనాగిరెడ్డి, వెంకటరామయ్య, నాగిరెడ్డి, నాగరాజ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

భాకరాపేట, ఏప్రిల్ 2: చిన్నగొట్టిగల్లుకు చెందిన 'రోహి' స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ అధ్యక్షుడు సహదేవయ్య ఆధ్వర్యంలో చిన్నగొట్టిగల్లు ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

పాకాల, ఏప్రిల్ 2: పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తేదీ ఆదివారం రాష్ట్రస్థాయి ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. టోర్నమెంట్‌కు సంబంధించి పోస్టర్‌ను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ రఫీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తిరుపతి చెస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో టోర్నీ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. వివరాల కోసం నిర్వాహకులు విజయబాబు సెల్ నెం.8143337722, మహేష్‌బాబు సెల్‌నెం. 9701401492లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యులు భువిందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.


హుండీలో నగదు చోరీ

పాకాల, ఏప్రిల్ 2: మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డి పల్లెలోని కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులోని సుమారు రూ.10వేల నగదు దోచుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయ పూజారి గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రగిరి

ఇవ్వడం చేతగాక ఆటలా?

● పింఛన్ల ఆలస్యంపై మండిపడుతున్న వృద్ధులు



తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ జగన్ పింఛన్ల డ్రామాకు తెరతీశారు. వలంటీర్లు పింఛన్లు పంచరాదన్న ఎన్నికల కమిషన్ నిర్ణయానికి కారణం టీడీపీ అంటూ నింద మోపుతున్నారు. వైసీపీ నాయకుల ఆదేశాలతో జిల్లాలో చాలా చోట్ల వలంటీర్లు ఇళ్లవద్దకు వెళ్లి టీడీపీ మీ పింఛను ఆపేయించిందని ప్రచారాలు కూడా మొదలు పెట్టారు. తొలి నుంచీ వలంటీర్లు.. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు రావడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి పింఛన్లు ఇళ్లవద్దకే పంపిణీ చేయడం ఈ రెండు నెలలూ కష్టం కూడా కాదు. సచివాలయ ఉద్యోగులతో ఈ పని పూర్తి చేయచ్చు. అయినా 3వ తేదీన సచివాలయాలకే వచ్చి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసిన తీరు మీద అవ్వాతాతలు మండిపడుతున్నారు. ఈ ఎండల్లో ఇదేమి హింస అని ప్రశ్నిస్తున్నారు.



పెన్షన్ల ఇంటింటి పంపిణీని టీడీపీయే అడ్డుకుందని వాట్సాప్‌లలో ప్రచారం చేస్తున్న వలంటీర్లు

సెర్ప్ ఆదేశాలు సవరిస్తూ మార్గదర్శకాలు

విపక్ష నాయకులు విమర్శలు చేయడం, అధికారులను కలిసి వినతిపత్రాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఒక మెట్టు కిందకు దిగింది. పెన్షన్ల పంపిణీపై సెర్ప్ సీఈవో ఆదేశాలను సవరిస్తూ మంగళవారం మార్గదర్శకాలను జారీచేసింది. దివ్యాంగులకు, వృద్ధులకు, రోగులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, తక్కినవారికి సచివాలయాల్లో పంపిణీ చేసే విధంగా ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజులపాటు సచివాలయాల్లో పంపిణీ చేయాలని, ఆ తర్వాత నేరుగా ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభించి ఏప్రిల్ 6 నాటికి పంపిణీ ముగించాలని, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సచివాలయాలు పనిచేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మండుతున్న వేసవిలో సచివాలయాల వద్దకు పిలిపించి పెన్షన్ ఇవ్వాలన్న నిర్ణయంపై పింఛన్‌దారులు తప్పుబడుతున్నారు. అందరికీ ఇంటివద్దకే ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

ఒక ఉద్యోగి 45 మందికి ఇవ్వలేరా?

జిల్లాలో 1691 సచివాలయాలుంటే 196 అర్బన్ పరిధిలో, 1495 గ్రామీణ ప్రాంతాల్లో వున్నాయి. వీటిలో 6005 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లాలో 17రకాల పెన్షన్లు 271473 ఉన్నాయి. ఇదివరకు వీటిని ప్రతినెలా వలంటీర్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో 12355 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. అంటే ఒక్కో వలంటీరు సగటున 21.మందికి పెన్షన్ అందించేవారు. ఇప్పుడు జిల్లాలో సచివాలయ ఉద్యోగులు 6005 మంది పనిచేస్తున్నారు. ఈ లెక్కన వలంటీర్ల సంఖ్యలో సగం మంది సచివాలయ ఉద్యోగులున్నారు. సగటున ఒక్కో సచివాలయ పరిధిలోకి 45 పెన్షన్లు వస్తాయి. ఒకటి లేదా రెండు రోజుల్లోనే మొత్తం పింఛన్లు పంపిణీ చేసేయొచ్చు. ఇలా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వలంటీర్లు లేకపోవడం వలన సచివాలయం వద్ద పంపిణీ చేస్తున్నట్టు బుకాయిస్తోంది. ఒక ఉద్యోగి సరాసరి 45 మందికి పింఛన్లు పంపిణీ చేస్తే ఎవరూ సచివాలయానికి రావాల్సిన పని ఉండదు.

ఒకటవ తేదీనే ఇచ్చేలా చూడాలి



ఒకటవ తేది ఇచ్చే పెన్షన్ ఇవ్వకపోవడంతో ఎన్నికలయ్యేదాకా ఇస్తారో ఇవ్వరో ఆందోళన పడ్డా. పదేళ్ల క్రితం ముంబాయిలో భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ రెండవ అంతస్తు నుంచి కింద పడ్డా. వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమయ్యా. అప్పట్నుంచీ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తో మందులు కొనుక్కుంటున్నా.వలంటీర్ల బదులు సచివాలయం సిబ్బంది ద్వారా ఒకటవ తేదీ నాడే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొంటే బాగుంటుంది.

- రవి, అమాసవారిపల్లె, చంద్రగిరి మండలం

పేదల కడుపు మంట



రాజకీయాల కోసం పేదలకు కడుపు మంట కలిగిస్తున్నారు. ఇది భావ్యం కాదు.క్షవర వృత్తి చేసుకుంటూ భార్యను పోషించుకునే వాడిని. రెండేళ్ల నుంచి ఒక కన్ను పూర్తిగా చూపు మందగించడంతో వృత్తిని వదలక తప్పలేదు. అప్పటినుంచి నేను,నా భార్య పించను ఆధారంగానే బతుకు బండి లాగుతున్నాం. వైసీపీ నాయకులు రాజకీయాల కోసం కావాలనే పింఛను జాప్యం చేశారు. ఇలా పేదలను ఇబ్బంది పెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు.

- వెంకటస్వామి, జయరాం రావు వీధి, శ్రీకాళహస్తి

వైసీపీ పాలనలో ఉపాధి కరువు : టీడీపీ



చంద్రగిరి, ఏప్రిల్ 2: వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు కరువయ్యాయని, ఈ ఐదేళ్లల్లో ఎంత నష్టం జరిగిందో ఆలోచించి ఓటు వేయాలని టీడీపీ యువనేత పులివర్తి వినీల్ కోరారు. మంగళవారం చంద్రగిరి మండలంలోని మిట్టపాళెం పంచాయతీలో 'మీ ఇంటికి మీపులివర్తి నాని, బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. తన తండ్రి పులివర్తి నానీని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి శివకోటిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, నాయకులు రమేష్‌రెడ్డి, బాలకృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ వేణు, బెలంకొండ రమేష్ రాయల్, రాజా రాయల్, ధనంజయలరెడ్డి, రాకేష్‌చౌదరి, అనార్కలి, యతిరాజులు, బాలసుబ్రమణ్యం, గురునాథంరెడ్డి, గౌస్‌బాషా పాల్గొన్నారు.

దహించిన వంటల ఆట

● అగ్నిప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతి



మీనాక్షి (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: ఇంటి వద్ద వంట బుడిగీలతో ఆడుకుంటున్న మీనాక్షి(5) అనే చిన్నారిని అగ్నిప్రమాదం దహించింది. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. వివరాలిలా.. శ్రీకాళహస్తి పట్టణం దేవరమిట్టకు చెందిన గణేష్ దంపతులు ఇంటి వద్ద చేపలు తోముకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో గణేష్ దంపతులు చేపల పనిలో నిమగ్నమయ్యారు. సెలవు రోజు కావడంతో పెద్ద కూతురు మీనాక్షి ఇంటి పక్కన వంట బుడిగీలతో ఆడుకుంటుండగా నిప్పురవ్వలు పక్కనే ఉన్న చెత్తకు అంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. చిన్నారి గౌనుకు మంటలు వ్యాపించడంతో తీవ్రంగా గాయపడి కేకలు వేసింది. పాప అరుపులు విన్న కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మీనాక్షి మృతి చెందింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అగ్నిప్రమాదం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులు అప్పగించారు. ఆడుకునే చిన్నారి అనంత లోకాలకు చేరడంతో దేవరమిట్ట ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఘర్షణను అడ్డుకున్న పోలీసులు

● తిరగబడ్డ వైసీపీ కార్యకర్తలు ● కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు నమోదు

చంద్రగిరి, ఏప్రిల్ 2: చంద్రగిరి పోలీస్‌స్టేషన్ ముందు ఘర్షణను అడ్డుకున్న పోలీసులపై వైసీపీ కార్యకర్తలు తిరగబడ్డారు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. మంగళవారం సాయంత్రం వైసీపీ కార్యకర్తలు మట్టిరెడ్డి నవీన్‌రెడ్డి, బాలాజీలు ఓ యువకుడిని కొడుతుండగా విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తంనాయుడు, కానిస్టేబుల్ రాజశేఖర్ అడ్డుకున్నారు. వారు పోలీసులపై తిరగబడ్డారు. ఈ ఘటనను వైసీపీ కార్యకర్త జయ ప్రకాష్ తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా స్టేషన్‌లో ఉన్న సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ పురుషోత్తం నాయుడు, రవి, ముని, రాజశేఖర్‌లు అతడిని స్టేషన్‌లోకి బలవంతంగా తీసుకెళ్లారు. అనంతరం తన విధులకు ఆటంకం కలిగించారని కానిస్టేబుల్ రాజశేఖర్ ఫిర్యాదు చేయడంతో మట్టిరెడ్డి నవీన్‌రెడ్డి, బాలాజీతో పాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేశారు.



పోలీస్ స్టేషన్ ముందు గొడవ జరుగుతున్న దృశం

హెడ్ కానిస్టేబుల్‌పై చర్యలకు ఎస్పీ ఆదేశం

పోలీసులు తనను చితకబాదడంతో గాయపడ్డానని తిరుపతి రుయాలో చికిత్స పొందానని జయప్రకాష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దీంతో హెడ్‌కానిస్టేబుల్ పురుషోత్తంనాయుడుపై ఎస్పీ చర్యలకు ఆదేశించినట్లు సమాచారం.

నేడు కల్యాణ వెంకన్న పుష్పయాగానికి అంకురార్పణ

చంద్రగిరి, ఏప్రిల్ 2: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహిస్తారు. ఆలయంలో ఫిబ్రవరి 29 నుంచి మార్చి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల తెలియక ఏవైనా పొరబాట్లు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు.ఇందులో భాగంగా గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరుగుతుంది. శ్రీవారి పుష్పయాగాన్ని పురస్కరించుకుని బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, గురువారం తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.


పోలింగ్ స్టేషన్ల పరిశీలన

చంద్రగిరి, ఏప్రిల్ 2: చంద్రగిరి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన ఎ.రంగంపేట, తొండవాడ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. మంగళవారం ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలోని 111, 112, 113, 114 పోలింగ్ కేంద్రాలను, తొండవాడలోని ఎంపీపీ పాఠశాలలో 130చ 131, అంగన్‌వాడీ కేంద్రంలోని 132 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయనవెంట తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, తహసీల్దార్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే పింఛన్ ఇవ్వాలి : టీడీపీ

ఎర్రావారిపాళెం, ఏప్రిల్ 2 : లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛను ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు రఘునాథ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల సొమ్మును కాంట్రాక్టర్‌లకు చెల్లించి పెన్షనర్లను ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదన్నారు. పైగా పింఛన్ల పంపిణీని టీడీపీ అడ్డుకుంటోందని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రధాన కార్యదర్శి మహేష్‌నాయుడు, కేశవులు నాయుడు, మధుసూదన్, మురళి, నాగరాజ, జయపాల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సుధాకర్‌నాయక్, అశోక్‌రెడ్డి, యనమల విజయారెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు



చంద్రగిరి, ఏప్రిల్ 2: చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ వద్ద ముందు వెళుతున్న లారీని కారుఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కాణిపాకానికి చెందిన రామలింగం తన కుటుంబ సభ్యులతో తిరుపతి నుంచి కాణిపాకానికి కారులో వెళుతుండగా ఫ్లైఓవర్ వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొన్నాడు. కారు ముందు చక్రం విరిగిపోవడంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి, లాలుశ్రీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల బస్సు బోల్తా

పాకాల, ఏప్రిల్ 2: మండలంలోని నేంద్రగుంట పెనుమూరు రోడ్డు పులివర్తివారిపల్లె సమీపంలో మంగళవారం ఉదయం ఓ స్కూల్ బస్సు బోల్తా పడింది. చంద్రగిరి మండలం ఐతేపల్లె సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు వడ్డేపల్లె వైపు నుంచి విద్యార్థులతో వస్తూ అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో 20 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లు తెలిసింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులందరూ సురక్షితంగా బయటపడడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



సుగుటూరు గంగజాతర ప్రారంభం

పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక నగరిలోని జమిందారీ ప్యాలెస్ దర్బారు కొలువలోట గంగమ్మను ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ ఏడాది అందరికీ ఉచిత దర్శనం కల్పించడంతో అధిక సంఖ్యలో భక్తులు రావడం, పోలీసులు లేకపోవడంతో తోపులాట జరిగింది. ఎండకు మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు తిరిగి వెళ్లే మార్గంలోనే అధికారపార్టీ శ్రేణులు పలుమార్లు ఎదురుగా రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి ఇలవేల్పు సుగుటూరు గంగమ్మకు మంగళవారం రాత్రి ప్యాలెస్‌లో జమిందారీ కుటుంబీకులు ఆనవాయితీ ప్రకారం తొలిపూజ చేశారు. సోమశేఖర చిక్కరాయులు, మల్లిఖార్జునరాయులు, వారి కుటుంబీకులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలత, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ తదితరులు పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పుష్పపల్లకిలో అమ్మవారిని కొలువుతీర్చి తేరువీధి, సెంటర్‌లాడ్జి, సుబేదారువీధి, బెస్తవీధి, తూర్పుమొగసాల, కుమ్మరవీధి, కట్టకిందపాళ్యం ప్రాంతాల్లో ఊరేగించారు. ఊరేగింపులో జంతుబలులు ఇచ్చారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు.



అమ్మవారి ఊరేగింపు కోసం ప్యాలెస్ వద్ద ఎదురుచూస్తున్న భక్తులు



సుగుటూరు గంగమ్మకు తొలిపూజ చేస్తున్న జమీందారీ వంశస్తులు

నేడు ఆలయంలో భక్తుల సందర్శన

పుంగనూరు ప్యాలెస్ ఆవరణలోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం వేకువజామునుంచి భక్తుల సందర్శనార్థం అనుమతిస్తారు. జాతరలో అమ్మవారికి గెరిగెలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాట్లు చేశారు.

జాతరలో గొర్రె పొట్టేళ్ల సంత

సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం పుంగనూరు ఆర్టీసీ డిపో సమీపంలోని తోపుమఠం వద్ద గొర్రెపొట్టేళ్ల సంత నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెపొట్టేళ్లతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు భారీగా తరలివచ్చి కొనుగోళ్లు చేశారు. సంతలో రూ.10వేలు నుంచి రూ.55వేలు విలువ చేసే పొట్టేళ్ల వ్యాపారం సాగింది. జాతరలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు జంతుబలుల కోసం పుంగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు భారీసంఖ్యలో గొర్రెపొట్టేళ్లు, కోళ్లు కొనుగోలు చేశారు.



పుంగనూరులో జరిగిన గొర్రెపొట్టేళ్ల సంత

చంద్రగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా వాసు



కనుపర్తి శ్రీనివాసులు

చంద్రగిరి, ఏప్రిల్ 2: చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పట్టణానికి చెందిన కనుపర్తి శ్రీనివాసులు అలియాస్ కేపీఎస్ వాసును అధిష్ఠానం ఎంపిక చేసింది.అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే గుంటి శ్రీరాములుకు అల్లుడు వరసయ్యే వాసు 2019 లోనూ కాంగ్రెస్ తరపున పోటీచేశారు.

రైలు ప్రయాణికులకేంటీ కష్టం?

తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 2: తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైలు దిగి వెలుపలకు వచ్చాక అక్కడున్న హోటళ్ల నిర్వాహకుల నుంచి ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతుండటంతో ఉన్న రోడ్డులో సగం స్థలంలో నిర్మాణ సామగ్రి ఉంటోంది. మిగిలిన రోడ్డులో హోటళ్ల నిర్వాహకులు, సిబ్బంది మకాం వేసి.. ముందుకు వెళ్లనీయకుండా.. తమ హోటల్‌లోనే టిఫిన్, భోజనం చేయాలని బలవంతం చేస్తున్నారని, ఇదేంటని అడిగితే ఒక్కోసారి దౌర్జన్యానికి దిగుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోదండరామాలయంలో నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 2: కోదండరామస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయంలో ఈనెల ఐదు నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ శుద్ధి కార్యక్రమం చేపడుతున్నారు. ఉదయం 6.30 నుంచి తొమ్మిది గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

తిరుపతి

ఇంటి వద్దకెళ్లే పింఛన్లు పంపిణీ చేయాలి

- వలంటీర్ల స్థానంలో ప్రభుత్వ సిబ్బందిని ఏర్పాటు చేయండి
- కలెక్టర్‌కి టీడీపీ నేతల వినతి


కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2: 'సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దకెళ్లే పంపిణీ చేయాలి. ఇందుకోసం వలంటీర్ల స్థానంలో ప్రభుత్వ సిబ్బందిని ఏర్పాటు చేయండి' అని కలెక్టర్ లక్ష్మీశను టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు నరసింహయాదవ్, రవినాయుడు మాట్లాడుతూ.. వృద్ధుల పింఛను సొమ్మును జగన్ ప్రభుత్వం తమ కావాల్సిన కాంట్రాక్టర్లు, బినామీలకు దోచిపెట్టి.. ఖజానా ఖాళీ చేసిందని ఆరోపించారు. దీనిని కప్పిపుచ్చేందుకు టీడీపీపై బురద జల్లుతోందని విమర్శించారు. మరోవైపు వలంటీర్లను రాజీనామా చేయాలని వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, హేమంత్ రాయల్, కృష్ణయాదవ్, పుష్పావతి, ఆనంద్ గౌడ్, రుద్రకోటి సదాశివం, శ్రీనివాసులు, సురేంద్రనాయుడు, సింధుజ, మనోహరాచారి, రజనీకాంత్, మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ వృథాను అరికట్టేదెవరు?


పైపులైన్ల లీకేజీతో ప్రవాహాన్ని తలపిస్తున్న తాగునీరు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 2: నగరానికి తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. దీనివల్ల నీరు వృథాగా పోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. టీడీపీ హయాంలో కల్యాణి డ్యాం నుంచి నగరానికి నీటి సరఫరా ఏర్పాట్లు చేశారు. శ్రీనివాస మంగాపురంలోని నీటి సరఫరా కేంద్రంనుంచి చెర్లోపల్లె, జూపార్కు, సైన్స్ సెంటర్ వరకు పైపులను భూగర్భంలో ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నగరంలో సగం నివాసాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నివాసాలు పెరుగుతున్న కొద్దీ నీటి అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో పాతికేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులు తరచూ లీకవుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. తాజాగా శ్రీనివాసమంగాపురం పంపు షెడ్డు నుంచి అలిపిరి సైన్స్ సెంటర్ వరకు పైపులు లీకవుతున్నాయి. రోడ్ల వెంబడి నీరు ప్రవాహంలా పోతున్నా పట్టించుకునే దిక్కులేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటిని వృథా చేయొద్దు: కమిషనర్

ఎండల తీవ్రత కారణంగా నీటి లభ్యత తగ్గుతోందని, అందువల్ల ప్రజలు నీటిని వృథా కాకుండా పొదుపుగా వాడుకోవాలని నగర కమిషనర్ అదితిసింగ్ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. తిరుపతికి తెలుగుగంగ (కైలాసగిరి రిజర్వాయర్), కల్యాణీడ్యాంతోపాటు 388 పవర్‌బోర్లు, 226 చేతి పంపుల ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతోందని పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కేంద్ర బలగాల రాక

పాతికవేల దొంగ ఓట్లు చేర్చిన ఎమ్మెల్యే - కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు


ఐక్యతను చాటుతున్న నాయకులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 2: నగరంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర బలగాలు రానున్నాయని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం ఓ హోటల్‌లో జనసేన వార్డు అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నగర, లీగల్ కమిటీ సభ్యులతో పరిచయ కార్యక్రమం, ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి దొడ్డిదారిలో పాతికవేల దొంగ ఓట్లను చేర్చారని విమర్శించారు. డివిజన్ల వారీగా దొంగ ఓట్లను అడ్డుకునేందుకు జనసైనికులు సంసిద్ధమవ్వాలని చెప్పారు. తాను 24గంటలు అందుబాటులో ఉంటానని, జనసైనికులపై ఈగ కూడా వాలనివ్వనని హామీ ఇచ్చారు. జనసేన జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్,నగరాధ్యక్షుడు రాజారెడ్డి, వీరమహిళలు పాల్గొన్నారు.

- నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని ఆరణి అన్నారు. ఓ హోటల్లో మంగళవారం మధ్యాహ్నం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవులపాటి బుజ్జిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు.

పదో క్లస్టర్లో టీడీపీ ఆత్మీయ సమావేశం

తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో క్లస్టర్ టీడీపీ ఇన్‌చార్జి, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆధ్వర్యంలో మంళవారం స్థానిక కమ్మ అభ్యుదయ సంక్షేమ సంఘం కార్యాలయంలో కూటమి అభ్యర్థి ఆరణితో ఆత్మీయ సమావేశం జరిగింది. నాయకులు నరసింహ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, ఆర్సీ శ్రీనివాసులు, 35, 42, 43, 44 అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. వైసీపీకి కొమ్ము కాసే అధికారులకు బదిలీ వేటు ఖాయమన్నారు.

'సిద్ధం' సభకు ఆర్టీసీ బస్సులు

తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు - నేడు, రేపు కూడా ఇదే పరిస్థితి


సీట్ల కోసం ప్రయాణికుల కుస్తీ

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 2: 'సిద్ధం' సభకు జిల్లా నుంచి 250 బస్సులను దారి మళ్లించడంతో సెంట్రల్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా పశ్చిమ మండలాలకు నడిచే సర్వీసులను దాదాపుగా సభకు పంపేయడంతో మంగళవారం ఉదయం నుంచే కష్టాలు మొదలయ్యాయి. బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించడంతోపాటు సీట్ల కోసం ప్రయాణికులు కుస్తీ పడ్డారు. మరోవైపు అవకాశం ఉన్న ప్రతి స్టేజీకి ప్రయాణికులను ఎక్కించుకోవాలని బస్టాండు అధికారులు సూచించినా కొందరు డ్రైవర్లు, కండక్టర్లు పాటించలేదు. దీనిపై సిబ్బంది, ప్రయాణికుల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న అధికారులు తమ సిబ్బందిని మందలించడంతో పరిస్థితి కొంత చక్కబడింది. దీనిపై పాకాలకు చెందిన జానకి అనే వృద్ధురాలు, చిన్నగొట్టిగల్లుకు చెందిన రాధమ్మ మాట్లాడుతూ.. బస్సులను ఇలా తరలించడం దారుణమన్నారు. కాగా, బుధ, గురువారాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండనుంది.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో క్యాంపస్ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2: ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఎంపికలు జరిగాయి. శ్రీసిటీలోని ప్రముఖ ఎయిర్ కండిషనింగ్ కంపెనీ డైకిన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ బ్రాంచిలకు చెందిన 90 మంది విద్యార్థులు హాజరవగా, ప్రతిభ చూపిన 60 మందిని డిప్లొమా ఇంజనీరింగ్ ట్రైనీ ఉద్యోగాలకు కంపెనీ ఎంపిక చేసుకుంది. వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.2.2 లక్షల ప్రాథమిక వేతనం ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులతో కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీపీవో శైలజ, అధ్యాపకులు ఎ.ధనుంజయ, సుధీర్‌కుమార్ రెడ్డి, ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ రామారావు, జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ పాల్గొన్నారు.

వెటర్నరీలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

తిరుపతి(రూరల్), ఏప్రిల్ 2: ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో చంద్రగిరి నియోజకవర్గానికి(166) సంబంధించి ఈవీఎంలను భద్రపరిచే ఇంటీరియం స్ట్రాంగ్ రూమ్‌ని మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈఆర్వో నిశాంత్‌రెడ్డితో కలెక్టర్ కలసి శాసనసభ, లోక్‌సభకు సంబంధించి ఈవీఎంలు భద్రపరిచే గదులను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఇదేవర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ ప్రాంతాన్ని పరిశీలించి, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని చెప్పారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్లు మారుతి, నాగరాజు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు కాంగ్రెస్ అభ్యర్థిగా మురళీ మోహన్

ఎస్వీయూ పూర్వ విద్యార్థికి దక్కిన అవకాశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: పుంగనూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ గోపాలగారి మురళీమోహన్ యాదవ్‌కు అవకాశం దక్కింది. సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించింది. రామసముద్రం మండలం బల్లసముద్రం గ్రామానికి చెందిన ఈయన ఎస్వీయూనివర్సిటీ ఎకనమెట్రిక్స్ విభాగం నుంచి 2010లో పీజీ, 2018లో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే ఏపీ బీసీ స్టూడెంట్ జేఏసీ కన్వీనర్‌గా, సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. అఖిలేష్ యాదవ్‌తోనూ సాన్నిహిత్యం ఉంది. అనంతరం అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యూత్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్‌గా పని చేస్తున్నారు.

ఆటిజంపై అప్రమత్తత అవసరం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 2: మానసిక ఎదుగుదల లోపం కారణంగా చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధుల్లో ఆటిజం ఒకటని.. దీనిపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీహరి సచించారు. ప్రపంజ ఆటిజం దినం సందర్భంగా రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగం, మానసిక విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కిరీటి, డాక్టర్ ప్రదీప్, డీపీఎంవో శ్రీనివాసులు, రుయా ఏఆర్‌ఎంవో డాక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద గంగమ్మగుడి మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభం


విద్యుద్దీపాలంకరణలో పెద్దగంగమ్మ గుడి - ఆలయం లోపల కలశస్థాపన

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 2: ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న తిరుపతి క్షేత్ర గ్రామదేవత తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ గణపతి హోమం, కలశస్థాపన, వాస్తుహోమం ఇత్యాది కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించి, మహాకుంభాభిషేకానికి నాందిపలికారు. రాత్రి జలాధివాసం క్రతువును శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. బుధవారం ఉదయం యాగశాలలో పంచగవ్య ఆదివాసం, బింబశుద్ధి, సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం కైంకర్యాలు చేయనున్నారు. తొలిరోజు జరిగిన ఉత్సవంలో గ్రూపు ఆలయాల ఈవో కె.మమత, కమిటీ చైర్మన్ బాబుయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

నేటినుంచి మహిళా వర్సిటీలో 'విరించి'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నుంచి విరించి-2కె24 కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండ్రోజులపాటు చేపట్టే ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో ప్రారంభం కానుంది. ప్రారంభ సభలో వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని, ప్రకృతివనం వ్యవస్థాపకుడు ప్రసాద్, తదితరులు పాల్గొంటారు. విద్యార్థులకు ప్రతిభా, సాంస్కృతిక పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు. ఈ మేరకు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

5న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: ఎస్వీయూనివర్సిటీ తెలుగు విభాగంలో ఈనెల 5వ తేదీన ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. తెలుగు విభాగం - ఈ తరం కవితా వేదిక సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, సలహాదారు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, ఈ తరం కవితా వేదిక అధ్యక్ష, కార్యదర్శులు తోట వెంకటేశ్వర్లు, ఎస్డీ చంద్రశేఖర్ పాల్గొంటారు. విద్యార్థులు కవితా పఠనం చేస్తారు. ఉత్తమ కవితలకు బహుమతులు అందజేయనున్నారు.

రుయాలో అద్దె చెల్లించని క్యాంటీన్ల సంగతేంటి?

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 2: రుయాస్పత్రిలోని అధికార పార్టీకి చెందిన కొందరు రెండేళ్లుగా కనీసం రూపాయి కూడా అద్దె చెల్లించకుండా వ్యాపారాలు సాగిస్తున్న విషయంపై గత ఏడాది డిసెంబరు 11వ తేదీన 'అద్దె అడిగేదెవరు?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మందలించడంతో పలువురు దుకాణదారులు అద్దెను చెల్లించారు. కానీ రూ.పది లక్షల వరకు అద్దె బకాయిలున్న రెండు క్యాంటీన్ల నిర్వాహకులు మాత్రం అద్దె చెల్లించేది లేదని చెప్పడంతో అదే నెల 29న ఆ రెండు క్యాంటీన్లను సీజ్ చేశారు. పది రోజుల్లోపు బకాయిలను చెల్లించకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులిచ్చారు. ఇప్పటికి మూడు నెలలైనా ఆ క్యాంటీన్ నిర్వాహకులు అద్దెలు చెల్లించిన దాఖలాల్లేవు. క్యాంటీన్ల టెండరు గడువు మరో రెండు నెలల్లో ముగియనుంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలొస్తున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 62,439 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,027 మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. బీఆర్ఎస్ ఎంపీ లింగయ్య యాదవ్, తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, సునీత మహేందర్‌రెడ్డి దంపతులతోపాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం


వరలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: ఎస్వీయూ ఎకనమిక్స్ స్కాలర్ పి.వరలక్ష్మి డాక్టరేట్ పొందారు. చిత్తూరు జిల్లా హోటళ్ల రంగంపై జీఎస్టీ ప్రభావం అనే అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ శాంతకుమారి పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

తిరుపతి ఎంపీగా పోటీ చేస్తున్నా

- ఆర్పీఐ అధ్యక్షుడు అంజయ్య

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 2: ఇండియా కూటమిలో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) దక్షిణ భారతదేశ అధ్యక్షుడు అంజయ్య తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమిలో ఆర్పీఐ కూడా కలవడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే తనకీ అవకాశం వచ్చిందని చెప్పారు. ప్రజాస్వామ్యవాదులు, దళిత, ప్రజాసంఘాలు, ప్రజలంతా తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. గోవిందయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ చర్యలను ఖండిస్తున్నాం : ఎమ్మార్పీఎస్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 2: ఎన్డీయే కూటమిలో కలిసే విధంగా మందకృష్ణ మాదిగ చేసిన చర్యలను ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఫౌండర్ అధ్యక్షుడు బ్రహ్మయ్య మాదిగ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వర్గీకరణ విషయంలో పార్లమెంటులో ఒకరోజు కూడా బీజేపీ ప్రస్తావన చేయలేదన్నారు. అలాంటి బీజేపీతో జతకట్టేందుకు ఏం లాభం పొందుతున్నారో మందకృష్ణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మణికంఠరాజు, నాగయ్య, జానకీరామ్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నగరాధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్

తారకరామనగర్, ఏప్రిల్ 2:యువజన కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా కె.వెంకటేష్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి తెలిపారు. తనకీ అవకాశం కల్పించిన కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ తదితరులకు వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి ఎస్వీయూలో ఒంటి పూట తరగతులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2: ఎస్వీయూనివర్సిటీలో బుధవారం నుంచి ఒంటి పూట తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులతో పాటు ఉద్యోగులకు కూడా ఇదే ఉత్తర్వులు వర్తించనున్నాయి. అయితే, అత్యవసర సేవలకు ఉద్యోగులు అందుబాటులో ఉండాలని అధికారులు కోరారు.

ఘనంగా సంస్కృత వర్సిటీ వార్షికోత్సవం



తిరుపతి(రూరల్), ఏప్రిల్ 2: జాతీయ సంస్కృత వర్సిటీ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. అతిథులుగా వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన దేవరాజ్ యు.ఆర్.ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వీసీ బి.వెంగమ్మ మాట్లాడుతూ.. సంస్కృత భాష సంరక్షణకు వర్సిటీ గొప్ప విద్యాస్థానమని అభివర్ణించారు. వర్సిటీలోని యోగా విభాగం, స్విమ్స్ ఆస్పత్రులు పరస్పర అవగాహన ఒప్పందం ద్వారా వివిధ రోగాలకు చికిత్స చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వీసీ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ సింగరాజు దక్షిణామూర్తి శర్మ, అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, ప్రొఫెసర్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర పుష్కరిణి వద్ద వినపడని అన్నమయ్య కీర్తనలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 2: రామచంద్ర పుష్కరిణి వద్ద ఉదయం వాకింగ్ వచ్చేవారు అన్నమయ్య కీర్తనలు వింటూ ఆహ్లాదంగా గడిపేవారు. ఏడాది నుంచి ఈ కీర్తనలు వినిపించడం లేదు. ఏం జరిగిందోనని కొందరు ఆరా తీయగా ప్రసార పరికరాలు చోరీకి గురయ్యాయని తెలిసింది. క్రైం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్నా.. టీటీడీకి చెందిన పరికరాలు చోరీ గురికావడం ఏంటని వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై టీటీడీ ఉన్నతాధికారులు విచారించి, అన్నమయ్య కీర్తనలు తిరిగి ప్రసారం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైసీపీని గద్దె దించేందుకు కలిసికట్టుగా పోరాటం: పాశం


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 2: రాష్ట్రంలో విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మిటాత్మకూరు, పగడాలపల్లి, మంగళపూరు, వెడిచెర్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పేదలకు పెన్షన్లు కూడా అందించలేదని స్థితిలో ఉందన్నారు. ఐదేళ్లపాలనలో రాష్ట్రంలో అన్ని వనరులను వైసీపీ నాయకులు కొల్లగొట్టారని ఆరోపించారు. గాడితప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. అలాగే పెన్షన్ రూ.4వేలకు పెంచి ఇంటి వద్దే అందించేలా చంద్రబాబునాయుడు బాధ్యత తీసుకుంటారన్నారు. పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, దుద్దా రాఘవరెడ్డి, నంబూరు వెంకటేశ్వర్లు నాయుడు, పుట్టి వెంకటేశ్వర్లు, గోపాలయ్య నాయుడు, శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధురెడ్డి, మట్టం శ్రావణి, రఘునాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


ఓటు హక్కు అవగాహనపై మానవహారం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 2: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఉదయభారతి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయ అన్నారు. వరదయ్యపాళెం తహసీల్దారు కార్యాలయం న ఉంచి బస్టాండు వరకు ఓటు హక్కు మన హక్కు... ఓటును అమ్ముకోవద్దు అనే నినాదాలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటరమణ, ఆర్ఐ వేణుగోపాల్, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, డీటీ శాంతి, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఆశాలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, డిగ్రీ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట పంచాయతీ ఈవోపై విచారణ


సుబ్బరాజు బోరులో నిర్మిస్తున్న ఇల్లు

రేణిగుంట, ఏప్రిల్ 2: స్థానిక పంచాయతీ ఈవో రవిశంకర్‌రెడ్డిపై జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే పట్టణంలో పంచాయతీ ఆధీనంలో ఉన్న సుబ్బరాజు బోరు స్థలానికి పంచాయతీ ఈవో ఎన్‌వోసీ ఇవ్వడంతో అక్కడ ఇంటి నిర్మాణం జరిగిపోయింది. ఈ విషయమై మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రావణన్ హైకోర్టుకు వెళ్లడంతో పాటు రాష్ట్ర పంచాయతీ సెక్రటరీ, జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ డీఎల్పీవోను ఆదేశించారు.

వలంటీరు రాజీనామా

పిచ్చాటూరు, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వలంటీర్లను ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదంటూ ఎలెక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన సంపత్ కుమార్ అనే వలంటీరు మంగళవారం కీళపూడి సచివాలయం సెక్రటరీ పురుషోత్తంకు తన రాజీనామా లేఖను అందించారు.

తొట్టంబేడు: మండలంలోని పొట్టి మేడ మండలం చియ్యవరం సచివాలయానికి చెందిన వాలంటీర్లు పెంచలయ్య, వెంకటేశ్వరరావులు, తొట్టంబేడు వన్ సచివాలయానికి చెందిన భాను మంగళవారం వారి రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం


సంస్థ నిర్వాహకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నాగలాపురం, ఏప్రిల్ 2: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ, బైట కొడియంబేడు గ్రామాల్లో తాగునీటి సమస్యను గుర్తించిన అమెరికాకు చెందిన కేటర్లేస్యూర్ స్వచ్ఛంద సంస్థ తాగునీటి సమస్యను పరిష్కరించింది. ఆగ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.5లక్షలతో బోర్‌వెల్ వేసి తాగు నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. వీటిని సంసంస్థ నిర్వాహకులు మంగళవారం ప్రారంభించి తాగు నీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంకమ్మ, వైసీపీ నాయకులు అంకయ్య, మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్



రేణిగుంట, ఏప్రిల్ 2: స్థానిక వైసీపీ కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్ పాల్గొన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్లితే రేణిగుంట వైసీపీ మండలం ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదిర్ ఎండీయూ ఆపరేటర్‌గా వ్యవహరిస్తున్నాడు. గత నెల 24న పట్టణంలో మేము సిద్ధం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరుకాగా, ఎండీయూ ఆపరేటర్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్న ఫొటో సోషల్ మీడియాలో పేపర్ కటింగ్స్ వైరల్ అవుతోంది.

దహించిన వంటల ఆట

అగ్నిప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతి


మీనాక్షి (పాత చిత్రం)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: ఇంటి వద్ద వంట బుడిగీలతో ఆడుకుంటున్న మీనాక్షి(5) అనే చిన్నారిని అగ్ని ప్రమాదం దహించింది. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తిలో వెలుగు చూసింది. వివరాలిలా.. శ్రీకాళహస్తి పట్టణం దేవరమిట్టకు చెందిన గణేష్ దంపతులు ఇంటి వద్ద చేపలు తోముకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో గణేష్ దంపతులు చేపల పనిలో నిమగ్నమయ్యారు. సెలవు రోజు కావడంతో పెద్ద కూతురు మీనాక్షి ఇంటి పక్కన వంట బుడిగీలతో ఆడుకుంటుండగా నిప్పురవ్వలు పక్కనే ఉన్న చెత్తకు అంటుకుని మంటలు ఎగసిపడ్డాయి. చిన్నారి గౌనుకు మంటలు వ్యాపించడంతో తీవ్రంగా గాయపడి కేకలు వేసింది. పాప అరుపులు విన్న కుటుంబ సభ్యులు హుటాహుటిన పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మీనాక్షి మృతి చెందింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అగ్నిప్రమాదం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులు అప్పగించారు. ఆడుకునే చిన్నారి అనంత లోకాలకు చేరడంతో దేవరమిట్ట ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

తడ, ఏప్రిల్ 2: చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని పాముల మిట్ట గ్రామానికి చెందిన బూదూరు జానకి ఇంట్లో గత శుక్రవారం చోరీ జరిగింది. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన వ్యక్తి మునిప్రకాష్ చోరీకి పాల్పడినట్లుగా అనుమానించి అదుపులో తీసుకొని విచారించారు. చోరీ తానే చేసినట్లుగా అంగీకరించాడు. అపహరించిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలు మునిప్రకాష్ ఇంట్లోనే గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

పాతకక్షలతో దాడి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 2: పాత కక్షల కారణంగా కత్తితో దాడిచేసి గాయపరచిన ఘటన పట్టణంలోని బీడీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కాలనీలో నివాసం ఉంటున్న ప్రసాద్‌కు అదే కాలనీలో నివాసం ఉంటున్న మౌళి యాక్షాద్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. సోమవారం ఇరువురు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ప్రసాద్‌పై మౌళియాక్షాద్ కత్తితో దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు హుటాహుటిన ప్రసాద్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

భానుడి భగభగలు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 2: సూర్యుడు భగభగ మండిపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. వెంకటగిరి పట్టణంలో మంగళవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. ఎండవేడికి తట్టుకోలేక ప్రజలు బయటకు రాకపోవడంతో పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు సైతం జన సంచారం లేక బోసిపోయాయి.

సుగుటూరు గంగజాతర ప్రారంభం


సుగుటూరు గంగమ్మకు తొలిపూజ చేస్తున్న జమీందారీ వంశస్తులు

పుంగనూరు, ఏప్రిల్ 2: పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. స్థానిక నగరిలోని జమిందారీ ప్యాలెస్ దర్బారు కొలువలోట గంగమ్మను ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ ఏడాది అందరికీ ఉచిత దర్శనం కల్పించడంతో అధిక సంఖ్యలో భక్తులు రావడం, పోలీసులు లేకపోవడంతో తోపులాట జరిగింది. ఎండకు మహిళలు, వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులు తిరిగి వెళ్లే మార్గంలోనే అధికారపార్టీ శ్రేణులు పలుమార్లు ఎదురుగా రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి ఇలవేల్పు సుగుటూరు గంగమ్మకు మంగళవారం రాత్రి ప్యాలెస్‌లో జమిందారీ కుటుంబీకులు ఆనవాయితీ ప్రకారం తొలిపూజ చేశారు. సోమశేఖర చిక్కరాయులు, మల్లికార్జునరాయులు, వారి కుటుంబీకులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలత, చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, డీసీసీబీ ఛైర్‌పర్సన్ ఎం.రెడ్డెమ్మ తదితరులు పూజలు చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పుష్పపల్లకిలో అమ్మవారిని కొలువుతీర్చి తేరువీధి, సెంటర్‌లాడ్జి, సుబేదారువీధి, బెస్తవీధి, తూర్పుమొగసాల, కుమ్మరవీధి, కట్టకిందపాళ్యం ప్రాంతాల్లో ఊరేగించారు. ఊరేగింపులో జంతుబలులు ఇచ్చారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు.




నేడు ఆలయంలో భక్తుల సందర్శన

పుంగనూరు ప్యాలెస్ ఆవరణలోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో అమ్మవారిని బుధవారం వేకువజామునుంచి భక్తుల సందర్శనార్థం అనుమతిస్తారు. జాతరలో అమ్మవారికి గెరిగెలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాట్లు చేశారు.

జాతరలో గొర్రె పొట్టేళ్ల సంత

సుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం పుంగనూరు ఆర్టీసీ డిపో సమీపంలోని తోపుమఠం వద్ద గొర్రెపొట్టేళ్ల సంత నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెపొట్టేళ్లతో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు భారీగా తరలివచ్చి కొనుగోళ్లు చేశారు. సంతలో రూ.10వేలు నుంచి రూ.55వేలు విలువ చేసే పొట్టేళ్ల వ్యాపారం సాగింది. జాతరలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు జంతుబలుల కోసం పుంగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు భారీసంఖ్యలో గొర్రెపొట్టేళ్లు, కోళ్లు కొనుగోలు చేశారు.


పుంగనూరులో జరిగిన గొర్రెపొట్టేళ్ల సంత



పెన్షన్ల ఇంటింటి పంపిణీని టీడీపీయే అడ్డుకుందని వాట్సాప్‌లలో ప్రచారం చేస్తున్న వలంటీర్లు

ఇవ్వడం చేతగాక ఆటలా?



- పింఛన్ల ఆలస్యంపై మండిపడుతున్న వృద్ధులు

తిరుపతి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ జగన్ పింఛన్ల డ్రామాకు తెరతీశారు. వలంటీర్లు పింఛన్లు పంచరాదన్న ఎన్నికల కమిషన్ నిర్ణయానికి కారణం టీడీపీ అంటూ నింద మోపుతున్నారు. వైసీపీ నాయకుల ఆదేశాలతో జిల్లాలో చాలా చోట్ల వలంటీర్లు ఇళ్లవద్దకు వెళ్లి టీడీపీ మీ పింఛను ఆపేయించిందని ప్రచారాలు కూడా మొదలు పెట్టారు. తొలి నుంచీ వలంటీర్లు.. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు రావడంతో కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి పింఛన్లు ఇళ్లవద్దకే పంపిణీ చేయడం ఈ రెండు నెలలూ కష్టం కూడా కాదు. సచివాలయ ఉద్యోగులతో ఈ పని పూర్తి చేయచ్చు. అయినా 3వ తేదీన సచివాలయాలకే వచ్చి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసిన తీరుమీద అవ్వాతాతలు మండిపడుతున్నారు. ఈ ఎండల్లో ఇదేమి హింస అని ప్రశ్నిస్తున్నారు.

సెర్ప్ ఆదేశాలు సవరిస్తూ మార్గదర్శకాలు

విపక్ష నాయకులు విమర్శలు చేయడం, అధికారులను కలిసి వినతి పత్రాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఒక మెట్టు కిందకు దిగింది. పెన్షన్ల పంపిణీపై సెర్ప్ సీఈవో ఆదేశాలను సవరిస్తూ మంగళవారం మార్గదర్శకాలను జారీచేసింది. దివ్యాంగులకు, వృద్ధులకు, రోగులకు ఇంటివద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, తక్కినవారికి సచివాలయాల్లో పంపిణీ చేసే విధంగా ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజులపాటు సచివాలయాల్లో పంపిణీ చేయాలని, ఆ తర్వాత నేరుగా ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించింది. ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం నుంచి ప్రారంభించి ఏప్రిల్ 6 నాటికి పంపిణీ ముగించాలని, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ సచివాలయాలు పనిచేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మండుతున్న వేసవిలో సచివాలయాల వద్దకు పిలిపించి పెన్షన్ ఇవ్వాలన్న నిర్ణయంపై పింఛన్‌దారులు తప్పుబడుతున్నారు. అందరికీ ఇంటివద్దకే ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

ఒక ఉద్యోగి 45 మందికి ఇవ్వలేరా?

జిల్లాలో 1691 సచివాలయాలుంటే 196 అర్బన్ పరిధిలో, 1495 గ్రామీణ ప్రాంతాల్లో వున్నాయి. వీటిలో 6005 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. జిల్లాలో 17రకాల పెన్షన్లు 271473 ఉన్నాయి. ఇదివరకు వీటిని ప్రతినెలా వలంటీర్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో 12355 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. అంటే ఒక్కో వలంటీరు సగటున 21.మందికి పెన్షన్ అందించేవారు. ఇప్పుడు జిల్లాలో సచివాలయ ఉద్యోగులు 6005 మంది పనిచేస్తున్నారు. ఈ లెక్కన వలంటీర్ల సంఖ్యలో సగం మంది సచివాలయ ఉద్యోగులున్నారు. సగటున ఒక్కో సచివాలయ పరిధిలోకి 45 పెన్షన్లు వస్తాయి. ఒకటి లేదా రెండు రోజుల్లోనే మొత్తం పింఛన్లు పంపిణీ చేసేయొచ్చు. ఇలా ప్రత్యామ్నాయ మార్గం ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వలంటీర్లు లేకపోవడం వలన సచివాలయం వద్ద పంపిణీ చేస్తున్నట్టు బుకాయిస్తోంది. ఒక ఉద్యోగి సరాసరి 45 మందికి పింఛన్లు పంపిణీ చేస్తే ఎవరూ సచివాలయానికి రావాల్సిన పని ఉండదు.

ఒకటవ తేదీనే ఇచ్చేలా చూడాలి



ఒకటవ తేది ఇచ్చే పెన్షన్ ఇవ్వకపోవడంతో ఎన్నికలయ్యేదాకా ఇస్తారో ఇవ్వరో ఆందోళన పడ్డా. పదేళ్ల క్రితం ముంబాయిలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ రెండవ అం తస్తు నుంచి కింద పడ్డా. వెన్నెముక దెబ్బతిని మంచానికే పరిమితమయ్యా. అప్పట్నుంచీ ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌తో మందులు కొనుక్కుంటున్నా.వలంటీర్ల బదులు సచివాలయం సిబ్బంది ద్వారా ఒకటవ తేదీ నాడే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొంటే బాగుంటుంది.

- రవి,అమాసవారిపల్లె, చంద్రగిరి మండలం

పేదల కడుపు మంట



రాజకీయాల కోసం పేదలకు కడుపు మంట కలిగిస్తున్నారు. ఇది భావ్యం కాదు.క్షవర వృత్తి చేసుకుంటూ భార్యను పోషించుకునే వాడిని. రెండేళ్ల నుంచి ఒక కన్ను పూర్తిగా చూపు మందగించడంతో వృత్తిని వదలక తప్పలేదు. అప్పటినుంచి నేనునా భార్య పింఛను ఆధారంగానే బతుకు బండి లాగుతున్నాం. వైసీపీ నాయకులు రాజకీయాల కోసం కావాలనే పింఛను జాప్యం చేశారు. ఇలా పేదలను ఇబ్బంది పెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు.

- వెంకటస్వామి, జయరాం రావు వీధి, శ్రీకాళహస్తి,

విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను

ఆవలరేవు ఆక్రమణకు యత్నం..?

ఏర్పేడు, ఏప్రిల్ 2: దశాబ్దాలుగా రెండు గ్రామాల ప్రజలు పొలాలకు రాకపోకలు సాగించే మార్గం అది.. దానిపై వైసీపీ నాయకుల కన్ను పడింది. దానిని ఆక్రమించేందుకు పథకం వేసుకున్నారు. ఆమార్గం ఆక్రమణకు గురైతే తమ పొలాలకు దారి ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా...

ఏర్పేడు మండలం నాగంపల్లి, నచ్చనేరి గ్రామాల సరిహద్దులో కృష్ణంపల్లి రెవెన్యూ సర్వే నె ంబరు 303/5, 303/6లో ఆవల రేవుకు సంబంధించిన సుమారు ఎకరా ప్రభుత్వ స్థలం ఏర్పేడు - వెంకటగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉంది. ఈ మార్గాన్ని పూర్వీకులు ఆవలరేవు అని పిలిచేవారు. అడవిలో ఉన్న మహానందీశ్వర స్వామి కోనకు పూర్వం భక్తులు ఈ మార్గంలోనే దర్శనానికి వెళ్లేవారు. నచ్చనేరి, నాగంపల్లి గ్రామాల్లో ఉన్న పాడి రైతుల పశువులు, మేకలు, గొర్రెలను మేతకు ఈ దారిలోనే అటవీప్రాంతానికి తీసుకెళ్లేవారు.

వైసీపీ నాయకుల కన్ను..

ఆవలరేవుకు ఇరువైపులా స్థానిక వైసీపీ నాయకులకు కొంతపొలం ఉంది. దీంతో వారు విలువైన ఆవలరేవును తమ పొలల్లో కలిపేసుకుని ఓ మండల నాయకుడికి విక్రయించేందుకు ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు శివప్రసాద్ ద్వారా ఆ ఇద్దరు వైసీపీ నేతలు పట్టాలు పొందడానికి తీవ్రంగా ప్రయత్నిం చినట్లు సమాచారం. నియోజకవర్గ వైసీపీ నేతల అండదండలున్నాయని తెలుస్తోంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

ఏర్పేడు రెవెన్యూ అధికారులతో పాటు శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారులకు, కలెక్టర్‌కు స్పందనలో రైతులు ఎన్నో ఫిర్యాదులు అందించారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు.

ఆవల రేవు ప్రభుత్వ స్థలాన్ని స్థానిక వైసీపీ నేతలు ఆక్రమించుకుని సొమ్ముచేసుకునేందుకు ప్రయత్ని స్తున్నారనే రైతుల ఆరోపణపై ఏర్పేడు తహసీల్దారు ఉదయ భాస్కర్ రాజు వివరణ కోరగా.. రెండు రోజుల క్రితం నాగంపల్లి, నచ్చనేరి గ్రామాలకు చెందిన 20 మంది రైతులు వచ్చి ఈ సమస్యపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మండల సర్వేయర్ ద్వారా ఆ స్థలాన్ని సర్వేచేయించి రైతుల సమస్య పరిష్కరిస్తానని, ఆక్రమణ జరిగి ఉంటే ఖచ్చితంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ వెల్లడించారు.


ఆవలరేవు అని పిలుచుకునే ప్రభుత్వ స్థలంలో ఉన్న బాట

పుత్తూరు వార్తలు

వలంటీర్ రాజీనామా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2: మండలంలోని గోవింద పాళెం సచివాలయానికి చెందిన వలంటీర్ లత మంగళవారం రాజీనామా చేశారు. సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయాల్సిన వలంటీర్లు వైసీపీ కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తుండడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. గత శుక్రవారం మండల పరిధిలోని ఉత్తరపుకండ్రిగకు చెందిన వలంటీర్ నవీన్ వైసీపీ కండువా కప్పుకుని మరీ ప్రచారం నిర్వహించడంతో అతడిని ఎంపీడీవో విధుల నుంచి తొలగించారు. అంతేకాకుండా వైసీపీ నాయకుల వత్తిడి కూడా ఉండడంతో వలంటీర్లు రాజీనామాలకు తెరదీశారు.

నగరి కాంగ్రెస్ అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2: నగరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోచారెడ్డి రాకేష్‌రెడ్డిని ఆ పార్టీ అధిష్టానం మంగళవారం ప్రకటించింది. పుత్తూరు పట్టణానికి చెందిన ఆయన 2015-2023 మధ్య యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2023నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యవహరిస్తున్నారు. 2019లో నగరి నుంచి పోటీ చేసి ఓడిపోయారు.

సామాజిక భద్రతా పింఛన్లు వెంటనే ఇవ్వాలి


మున్సిపల్ టీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2: సామాజిక భద్రతా పింఛన్లను మున్సిపల్, సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందివ్వాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీకి కార్యకర్తల్లాగా పనిచేస్తున్న వలంటీర్ల స్థానంలో ప్రభుత్వ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే, జగన్ ప్రభుత్వం ఏకంగా పింఛన్లు అందివ్వకుండా పేదలపై కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రభుత్వానికి వచ్చిన కష్టమేమని నిలదీశారు. బుధవారం పింఛన్లు పంపిణీ చేయకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కౌన్సిలర్ భువనేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బీఆర్ యుగంధర్, మాజీ వైస్ ఛైర్మన్ డీఎస్ గణేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మాధవనాయుడు, తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్, నాయకులు వీడీ అశోక్, రాజా తదితరులు ఉన్నారు.

నారాయణవనం: గ్రామ సచివాలయ సిబ్బంది చేత లబ్ధిదారులకు ఇంటి వద్దకే పెన్షన్లను పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షులు గిరిబాబు, మాజీ మండలాధ్యక్షుడు భాస్కరన్, నాయకులు గోవిందస్వామి, రవి రెడ్డి, మురుగేష్‌రెడ్డి, గోవిందశెట్టి, దొరవేలు, ఆర్ముగం, శరవణ రెడ్డి, మణిరెడ్డి, నరేష్, సౌరకాయలు, ఆనందరావు, అన్నామలై, షణ్ముగం, కుమార్, వాసుదేవన్, ఏకే లత, లత, గోపి, మునివేలు, పొన్నుస్వామి, రమేష్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట: లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పంచాయతీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జానా వెంకటయ్య, ధనంజయులు నాయుడు, హేమావతి, లక్ష్మీప్రసన్న, మునిశేఖర్, శేషాద్రి యాదవ్, వెంకటరమణ, రాధాకృష్ణ, బాలకృష్ణ, టైలర్ బాబు, మస్తాన్, వేణు, అయ్యప్ప, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముత్యాలమ్మకు సారె సమర్పణ


సారె సమర్పిస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున సారె సమర్పించారు. ముత్యాలమ్మ జాతర పరిష్కరించుకుని మంగళవారం ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పట్టు వస్త్రాలను అందజేశారు.

అభివృద్ధికి చిహ్నం చంద్రబాబు


డయాలసిస్ కేంద్రం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న టీడీపీ నేతలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధికి చిహ్నమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, రెడ్డివారి గురువారెడ్డి, దశరధాచారి సంయుక్తంగా తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మూడు రోజుల క్రితం మీడియా సమావేశంలో టీడీపీ హయాంలో శ్రీకాళహస్తిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన ముగ్గురు రాష్ట్ర కార్యదర్శులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఉచిత డయాలసిస్ కేంద్రం వద్ద నుంచి సెల్ఫీ చాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా చలపతి నాయుడు మాట్లాడుతూ... గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం ప్రతిష్టాత్మకంగా ఉచిత డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డయాలసిస్ కేంద్రంలో కనీస వసతులు కూడా మెరుగుపరచకుండా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డి వారి గురువారెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో ప్రభుత్వ వైద్యం కోసం ప్రజలు అలమటిస్తున్న రోజుల్లో 1999వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, దివంగత మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి వంద పడకల ఏరియా ఆస్పత్రిని నెలకొల్పారని వివరించారు. శ్రీకాళహస్తితో పాటు చుట్టూ 9 మండలాలకు ప్రాణదాతగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని వైసీపీ ప్రభుత్వం పందులు, కుక్కలు సంచరించే దయనీయ పరిస్థితికి తీసుకువచ్చారని చెప్పారు. ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకుని ప్రజలకు మేలు చేయడంపై దృష్టి సారించాలని హితువు పలికారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని రాజగోపురం పక్కన మంగళవారం వెలుగు చూసింది. సోమవారం రాత్రి మద్యం సేవించిన గుర్తు తెలియని వ్యక్తి రాజగోపురం పక్కన నిద్రించాడు. ఉదయం మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని శవంగా నమోదు చేసి పోస్టుమార్టంకు తరలించారు.

9న పంచాంగ శ్రవణం

శ్రీకాళహస్తి ఏప్రిల్ 2: ఈ నెల 9వ తేదీ ఉగాది పర్వదినం సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం జరుగుతుందని ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు ఆలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీనారాయణ శర్మచే పంచాంగ శ్రవణం, 6 గంటలకు ప్రముఖ అవధాని మేడసాని మోహన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరగనట్లు పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోండి: టీడీపీ

సత్యవేడు, ఏప్రిల్ 2: సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల ద్వారా అవ్వా తాతలు. అభాగ్యులకు సామాజిక భద్రతా పింఛన్లను ఇళ్లవద్దకే పంపిణీ చేయాలని కోరుతూ టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు పరమశివం, గుర్రప్ప, శశిమోహన్ తదితరులు పాల్గొన్నారు

పింఛను పంపిణీకి కోడ్ సాకు వద్దు: ఎమ్మెల్యే

పిచ్చాటూరు, ఏప్రిల్ 2: సీఎం జగన్ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం బినామీ కాంట్రాక్టర్లకు రూ.13 వేల కోట్లు అప్పనంగా అప్పగించి ఖజానా ఖాళీచేసి నేడు టీడీపీ పింఛన్లను అడ్డుకుంటుందని విమర్శించడం తగదని ఎమ్మెల్యే ఆదిమూలం హితవు పలికారు. వృద్ధాప్య పింఛన్ డబ్బులను కాజేశామని చెప్పుకోవడానికి సిగ్గు పడి వలంటీర్లను ఇవ్వవద్దన్నారన్న టీడీపీ మీద నింద మోపడానికి తన మీడియా ద్వారా తప్పుడు రాతలు రాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా పింఛను ఇవ్వాలనుకుంటే ప్రతి సచివాలయంలో 15 మంది కార్యదర్శులున్నారని, వారి ద్వారా పింఛన్లు పంపిణీ చేయవచ్చని సలహా ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు కోడ్ సాకులను వదిలిపెట్టి పని చేయడంపై దృష్టి పెట్టాల్సిన ఎంతైనా ఉందన్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పెన్షన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇళ్ల వద్దనే పంపిణీ చేసేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. పిచ్చాటూరు మండల ఎంపీడీవో శ్రీనివాసులుకు పిచ్చాటూరు మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి వినతిపత్రం సమర్పించారు.

ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలి

నాగలాపురం, ఏప్రిల్ 2: సామాజిక భద్రతా పింఛన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతీ ఇంటికీ వెళ్లి పంపిణీ చేయాలంటూ నాగలాపురం మండల టీడీపీ నాయకులు ఎంపీడీవో బాబుకి వినతి అందించారు. ఈ సందర్భంగా మంగళవారం టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, ఇతర పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పార్థిబన్, మురళీ, పరశురాం శిల్పి, జాన్సన్, పురుషోత్తం నాయుడు, ఎండీ.కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వృద్ధులు, దివ్యాంగులు వంటి పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించేలా చర్యలు తీసుకోవాలని వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనసూయకు టీడీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మల్, జయచంద్రనాయుడు, నాగరాజు, పురుషోత్తం ముదిరాజ్, హరిప్రసాద్, రమణయ్య,అభిరామ్, రమేష్‌రెడ్డి, మోహన్‌నాయుడు, శంకర్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, రామయ్య, సురేష్, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: అవ్వ తాతలకు ఇంటింటికి పెన్షన్ పంపిణీ చేయాలని టీడీపీ నాయకులు కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎంపీడీవో రఫీ ఖాన్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

విజ్ఞానానికి గ్రంథాలయాలు ఎంతో అవసరం


శ్రీనివాసపురం ప్రాథమిక పాఠశాలలో ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రారంభించిన లైబ్రరీ

కేవీబీపురం, ఏప్రిల్ 2: బాలల్లో విజ్ఞానం పెరగాలంటే గ్రంథాలయాలు ఎంతో అవసరమని ప్రజాప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీనివాసపురం ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాన్ని ప్రారంభించి పుస్తకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మావూళయ్య, ప్రజాప్రగతి సిబ్బంది ఈశ్వర్, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలువ పందిళ్ల ఏర్పాటు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: వేసవి తీవ్రత దృష్ట్యా ముక్కంటి ఆలయంలో చలువపందిళ్ల ఏర్పాటు పనులను మంగళవారం ప్రారంభించారు. ఎండలు పెరగడంతో భక్తులకు నీడను పెంచేలా ఆలయం పరిసరాలలో చలువ పందిళ్ల ఏర్పాట్లు చేపట్టారు.

సత్యవేడు కాంగ్రెస్ అభ్యర్థిగా బాబు


బాలగురవం బాబు

సత్యవేడు, ఏప్రిల్ 2: సత్యవేడు నియోజకవర్గం కాంగ్రెస పార్టీ అభ్యర్థిగా సత్యవేడు మండలం రామచంద్రపురానికి చెందిన బాలగురవం బాబు పేరును ఆపార్టీ అధిష్టానం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో బాబుకు సత్యవేడు టికెట్ వరించింది. మల్లవారిపాళెం పంచాయతీ రామచంద్రపురంకు చెందిన బాలగురవం బాబు తొలినుంచి కాంగ్రెస్‌లో సేవలందించారు. అనంతరం 2018లో స్వంతంగా 'ప్రజాసేవ' పేరుతో పార్టీని స్థాపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తన పార్టీ తరపున సత్యవేడు అభ్యర్థిగా పోటీచేశారు. ప్రస్తుతం ప్రజాసేవ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి, ఇటీవల షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. సత్యవేడు నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసేందుకు రెండు నెలలు నుంచి ఆయన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో సత్యవేడు స్థానం కోసం పలువురు పోటీ పడ్డారు. ముఖ్యంగా మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ కుమార్తె ఇక్కడ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అదే విధంగా సీనియర్ నాయకుడు శిఖామణి చెల్లదురై, ఇటీవలే ఆప్ నుంచి పార్టీలోకి చేరిన ఎంటెక్ బాబు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. అయితే సత్యవేడు టికెట్ అనూహ్యంగా బాబు దక్కించుకున్నారు.

శ్రీకాళహస్తి అభ్యర్థిగా డాక్టర్ రాజేష్


పోతుగుంట రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ పోతుకుంట రాజేష్ నాయుడు ను అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అభ్యర్థుల జాబితా విడుల చేశారు. శ్రీకాళహస్తికి చెందిన పొదుగుంట గురవయ్య నాయుడు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగారు. ఒక దఫా ముక్కంటి ఆలయ ఛైర్మన్‌గా గురవయ్య వ్యవహరించారు. ఆయన తనయుడు రాజేష్ నాయుడు ఆర్థోపెడిక్ డాక్టర్‌గా బెంగళూరులో వైద్య సేవలందించారు. ఆయన సతీమణి చైతన్య ప్రముఖ వ్యాపారవేత్త ఆదికేశవ నాయుడు మనవరాలు. ఇటీవల రాజేష్ నాయుడు టీడీపీని వీడి కాంగ్రెస్ లో చేరారు. ఆయనకు పార్టీ అభ్యర్థిత్వం ఖరారు చేసింది.

బీజేపీని ఆదరించండి


వేమలపూడిలో జనసేన నాయకులతో వరప్రసాద్

కేవీబీపురం, ఏప్రిల్ 2: మండలంలోని వేమలపూడి గ్రామంలో తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మంగళవారం బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా అనేక సేవలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలబీజేపీ అధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్, జనసేన సత్యవేడు న ఇయోజకవర్గ కన్వీనర్ లావణ్యకుమార్, బీజేపీజిల్లా అధ్యక్షుడు మునికృష్ణ తదితర నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో మంగళవారం జనసేన, బీజేపీ ముఖ్యనాయకులతో కలిసి తిరుపతి బీజేపీ పార్లమెంటు అభ్యర్థి వరప్రసాద్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు పురుషోత్తం ముదిరాజ్, జనసేన మండలాధ్యక్షుడు చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల జాప్యం అమానుషం


వినతి పత్రం అందజేస్తున్న విజయ్ కుమార్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: వైసీపీ కుట్రపూరితంగా పింఛన్లు జాప్యం జరిగేలా చేయడం అమానుష చర్య అని టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పింఛన్లు పంపిణీ ప్రారంభించాలంటూ మంగళవారం శ్రీకాళహస్తి మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ... వైసీపీ ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ ఖజానాను ఎన్నికలకు ముందు ఖాళీ చేసిందన్నారు. అధికార యంత్రాంగం ఉన్న నిధులు లేకపోవడంతో పింఛన్ల పంపిణీ ఆలస్యం జరుగుతుందన్నారు. కానీ కనీస ఆర్థిక క్రమశిక్షణ లేని వైసీపీ ప్రభుత్వం పింఛన్లు పంపిణీ కూడా రాజకీయం చేయడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో ఆలయ ప్రవేశం.. ప్రశ్నిస్తే ధిక్కారం

● దళారీని అడ్డుకున్న ఆలయ ఉద్యోగి ● అంతుచూస్తానంటూ ఫోన్లో రెచ్చిపోయిన ఎమ్మెల్యే పీఏ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: ముక్కంటి ఆలయ ఉద్యోగిపై ఎమ్మెల్యే పీఏ అసభ్య పదజాలంతో విరుచుకుపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బయటకు రారా... నీ అంతు చూస్తా... నీకు డ్యూటీనే లేకుండా చేస్తా... ఏమనుకుంటున్నావు రా... మా వాడినే ఆపుతావా అంటూ మరికొన్ని అసభ్య పదజాలంతో ఎమ్మెల్యే పీఏ రెచ్చిపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఘటన సాక్షాత్తు ముక్కంటి సన్నిధిలో మహాద్వారం వద్ద జరగడం విశేషం.

శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు ముక్కంటి ఆలయ పరిసరాల్లో సంచరిస్తూ దళారీగా వ్యవహరిస్తుంటాడు. ఆలయ మూడో గేటు సమీపంలోని కార్ పార్కింగ్ వద్ద భక్తులతో ముందుగా ఒప్పందం చేసుకుని అడ్డదారి దర్శనాలు చేయిస్తూ గతంలో పలుమార్లు పట్టుబడ్డాడు. అయినా అధికార పార్టీ అండ ఉండడంతో ఆ దళారి ఇష్టారాజ్యంగా వ్యవహరించేవాడు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య మూడు సార్లు భక్తులకు అడ్డ దారి దర్శనాలకు ప్రవేశించాడు. ఇక సాయంత్రం దీపారాధన సమయంలో నాలుగోసారి ఆరుగురు భక్తులతో టికెట్ కొనుగోలు చేయకుండా మహాద్వారం గుండా అడ్డదారిలో ప్రవేశించే ప్రయత్నం చేశాడు. అక్కడ ఇంచార్జిగా ఉన్న రెగ్యులర్ ఉద్యోగి దళారీని అడ్డుకున్నారు. రెండు గంటల వ్యవధిలో ఇప్పటికి మూడు బృందాలకు ఆడదారి దర్శనాలు చేయించావు... దీపారాధన సమయంలో వెళ్లడం ఏంటని నిలదీశాడు. దాంతో దళారి ఉద్యోగిపై విరుచుకుపడ్డాడు. భక్తులు ఎదుట అవమానిస్తావా అంటూ దురుసుగా సమాధానం చెప్పాడు. ఆతర్వాత ఎమ్మెల్యే పీఏగా ఉన్న ఓ యువకుడికి దళారీ ఫోన్ చేసి మాట్లాడాలని ఉద్యోగికి ఇచ్చాడు. ఇక అంతే పీఏ సారు ఫోన్లో విరుచుకుపడ్డారు. బయటకు రారా.. నీ అంతు చూస్తా అంటూ బూతు పురాణం ఎత్తుకున్నాడు. ఇంతలో ఎస్పీఎఫ్ సిబ్బంది గమనించి దళారీని మందలించారు. దీపారాధన టికెట్లు కొనుగోలు చేయించి దర్శనానికి అనుమతించారు. అడ్డదారి దర్శనం ప్రశ్నించినందుకు దైవ సన్నిధిలో ఇంత దారుణంగా అవమానిస్తారా అంటూ ఆ ఉద్యోగి విలపిస్తూ ఇంటికి చేరుకున్నట్టు తెలిసింది.

బహదూర్ పేటలో జాతర సందడి



విశ్వ బ్రాహ్మణ వీధి నల్ల గంగమ్మ - కంఠా వీధి నల్ల గంగమ్మ ఆలయం వద్ద విద్యుత్తు అలంకరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: పట్టణంలోని బహదూర్ పేట ప్రాంతంలో జాతర సందడి నెలకొంది. బుధవారం జరగనున్న నల్ల గంగమ్మ జాతరను పురస్కరించుకుని రెండు రోజుల ముందు నుంచే బహదూర్ పేట ప్రాంతం ముస్తాబయింది. కంఠా వీధిలో వెలసిన నల్ల గంగమ్మ ఆలయ జాతర ఉగాదికి ముందు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం అర్ధరాత్రి తర్వాత అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు ప్రారంభమవుతుంది. రాతి పని వారి వీధి నుంచి అమ్మవారు బయలుదేరి, గాండ్ల వీధి, సాలిపేటలో ఊరేగిన తర్వాత ఉదయం కంఠా వీధిలో కొలువు తీరుతారు. అనంతరం బుధవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని తెట్టు కూడలి వరకు ఊరేగించి నిమజ్జనం మహోత్సవంతో జాతరకు ముగింపు పలుకుతారు. నల్ల గంగమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ కంఠా రమేష్ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బహదూరుపేట ప్రాంతంలోని విశ్వబ్రాహ్మణ వీధిలో వెలసిన నల్ల గంగమ్మ ఆలయంలో కూడా జాతర వేడుక ఘనంగా జరగనుంది. ఇందుకోసం ఆలయ నిర్వహకులు భారతం చంద్ర పెద్ద ఎత్తున ఏర్పాట్లు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి సన్నిధిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేసి వెండి వెండి కవచాలతో అలంకరించారు. కాగా గత ఏడాది జరిగిన సంఘటనల దృష్ట్యా ఎటువంటి గొడవలు జరగకుండా జాతరకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్ కుట్రతోనే పింఛన్ల పంపిణీలో జాప్యం



నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు.- విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: సీఎం జగన్ కుట్రపూరిత ఆలోచనతోనే పింఛన్లకు ఆలస్యం జరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పింఛన్ల జాప్యంపై మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... సీఎం జగన్ పథకం ప్రకారం ఎన్నికల సమయంలో కుట్రపూరిత రాజకీయాలకు తెర తీశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి, గోపాల్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పింఛన్ల ఆలస్యంపై ఎన్టీఆర్ భవన్లో నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసి చంద్రబాబుపై నిందలా..



రేణిగుంట, ఏప్రిల్ 2: వైసీపీ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి పెన్షన్ల విషయంలో చంద్రబాబుపై సోషల్ మీడియాలో నిందలు వేయడాన్ని బొజ్జల రిషితారెడ్డి తప్పుపట్టారు. మంగళవారం సాయంత్రం తారకరామా నగర్‌లో 3కస్టర్‌కు సంబంధించి క్లస్టర్ ఇన్‌ఛార్జి బుజ్జినాయుడు ఆధ్వర్యంలో మహిళా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిస్వామినాయుడు, భాస్కర్‌రెడ్డి, ఉదయ్, రాజేంద్ర, మునెయ్య, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కుక్కలగుంట ఎస్టీకాలనీ, రెడ్డిగుంట ఎస్టీకాలనీ,మర్రిమంద గ్రామం, ఎస్టీకాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, బాలాజీనాయుడు, మోహన్‌రావు, సతీష్‌నాయుడు, హేమాక్షి, నాగరాజునాయుడు, గిరినాయుడు, నిరంజన్‌బాబునాయుడు, సీతాపతి ఆచారి, రవికుమార్, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తారకరామనగర్: తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు అన్ని విధాలుగా గుర్తింపు వచ్చిందని శ్రీకాళహస్తి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి భార్య రిషితారెడ్డి పేర్కొనారు. మంగళవారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో ఇంటింటికి టీడీపీ ప్రచార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎం.బుజ్జినాయుడు, ఎం.చెన్నారెడ్డి, మునస్వామి నాయుడు, మునిరాజు, బాలాజీ, కోటి, మహేష్, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళల అభివృద్ధి

ఏర్పేడు, ఏప్రిల్ 2: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ అన్నారు. ఏర్పేడు మండలం క్లస్టర్ 9లో మహిళల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం ఏర్పేడులో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణవేణి, హంస, మంజులమ్మ, భారతి, గౌరమ్మ, జడ్పీటీసీ తిరుమలయ్య, నాయకులు మునెయ్య, రాచేటి సుబ్రహ్మణ్యం, గుణయాదవ్, మునీంద్ర, వెంకటయ్య, గోల్‌మెన్‌నాయుడు, బాలాజీయాదవ్, రమణయ్యయాదవ్, శ్రీనివాసులు యాదవ్, మోహన్, సుబ్రహ్మణ్యం, కుమార్, ఊటీచంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవ స్వామి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 2: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు మేళ తాళాల మధ్య అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. శ్రీకాళహస్తి పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతకు మధ్యాహ్నం దాతలు ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

చైతన్యపురంలో ఏనుగుల గుంపు కలకలం



తోపులో మధ్యలో వెళుతున్న ఏనుగు - ధ్వంసం చేసిన ప్రహరీ రాళ్లు

రేణిగుంట, ఏప్రిల్ 2: రేణిగుంట మంలం చైతన్యపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు కలకలం రేపింది. స్థానిక గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు వేసవికాలంలో శేషాచలం అడవి ప్రాంతం నుంచి మామండూరు అటవీ ప్రాంతానికి ఏనుగుల గుంపు నీటికోసం వస్తు వెళుతుంటాయి. ఇందులో భాగంగా ఏనుగులు గ్రామానికి సమీపంలో రావడంతో గుర్తించిన స్థానికులు టపాసులు కాల్చడంతో తోపులకు వేసిన ప్రహరీ రాళ్లను ధ్వంసం చేసి ఏనుగుల గుంపు వెళ్లిపోయిందని తెలిపారు.

పేదల కష్టాలను తెలిపిన ఓటమి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి


జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 2: తాను ఎమ్మెల్యేగా మొదటిసారి పోటీ చేసి ఓటమి చెందానని, ఆ ఓటమి తనకు పేదల కష్టాలను తెలిసేలా చేసిందని టీడీపీ, జనసేన, బీజేపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం పిల్లపాళెం క్రాస్‌రోడ్డు వద్ద జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తాను, తన సతీమణి రిషితారెడ్డి దాదాపు 86వేల కుటుంబాలను కలిసి వారు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహసి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ల్యాండు, ఇసుక మాఫియాలను పెంచి పోషించి ఆఖరికి శ్రీకాళహస్తి ఆలయ ప్రతిష్ఠను దిగజార్చారని దుయ్యబట్టారు. కార్యక్రమలో టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు చంద్రారెడ్డి, తేజవతి, జనసేన నాయకుడు బండ్ల లక్ష్మీపతి, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, చిన్నారెడ్డి, ప్రభాకర్, రాజేష్‌రెడ్డి, కృష్ణయాదవ్, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.